సాక్షి
కుమురం భీం

మంగళవారం, 4, ఏప్రిల్, 2023



తల్లిదండ్రులకూ పరీక్షే..!
పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎగ్జామ్ సెంటర్లు అందుబాటులో లేక విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పట్లేదు. 8లో▸



వేటగాళ్ల ముఠా పట్టివేత
పులిచర్మం విక్రయించేందుకు యత్నిస్తున్న వేటగాళ్ల ముఠాను మహారాష్ట్ర అటవీ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.5 /24.8
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి పెరుగుతుంది. గాలిలో తేమ అధికంగా ఉండి ఉక్కపోతగా అనిపిస్తుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ — మంగళ : 6:30
సహర్ — బుధ : 4:44

న్యూస్‌రీల్

ఎంసెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ రంగ కళాశాల విద్యార్థులకు అందిస్తున్న ఎంసెట్ క్రాష్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్య, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఎంసెంట్ వేసవి శిక్షణ ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 10.15 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7.45 గంటల వరకు ఆన్‌లైన్ తరగతులు ఉంటాయన్నారు. ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇప్పటికే సంబంధిత జూమ్ లింకులను విద్యార్థులకు పంపించారని, ఆ లింకుల ద్వారా జూమ్ తరగతులకు హాజరై ఉచిత శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. నిపుణులతో రూపొందించిన తరగతులు ఎంసెట్ రాయనున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆస్తి పన్నుపై 5శాతం రాయితీ

కాగజ్‌నగర్‌టౌన్: 2023 –24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లిస్తే ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం రాయితీ ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్. అంజయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ వస్తోందని వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నల్లా బిల్లులు, ఆస్తి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భట్రాజు సంఘం రాష్ట్ర కార్యవర్గంలో చోటు


పెద్ది రామరాజు


మధుసూదన్‌రాజు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భట్రాజు సంఘం ప్రధాన కార్యదర్శి కేసిపెద్ది రామరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు తంగెళ్ల మధుసూదన్‌రాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం భవనంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు.

బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొని పదాధికారులకు దిశా నిర్దేశం చేశా రు. ఆయన మాట్లాడుతూ బూత్ స్వశక్తి కరణ అభియాన్‌ను పార్టీ శ్రేణులు పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం పల్లెపల్లెకు ఓబీసీ –ఇంటింటికీ బీజేపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు రాజమౌళి గౌడ్, కాసిపేట లింగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేందుకు సహకరించాలని సోమవారం మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌ను పట్టణంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1994 నుంచి ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి బీజేపీ అధిష్టానం వర్గీకరణకు అనుకూలమని చెబుతోందన్నారు. కేంద్రంలో సంపూర్ణ మెజారిటీలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కంబాల రమేశ్, జలంపల్లి శ్రీనివాస్, శ్రీశైలం, అంజయ్య, పిట్టల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి) అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి(ఫైల్)

బెబ్బులి భద్రమేనా..?

- వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న పెద్దపులులు
- వివరాలు వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్న అటవీ అధికారులు
- మహారాష్ట్రలో చర్మం విక్రయిస్తుండగా పట్టుబడిన జిల్లావాసులు
- ఆసిఫాబాద్ అటవీ డివిజన్‌లో వేటాడినట్లు ఒప్పుకున్న నిందితులు

సిర్పూర్(టి): జిల్లాలోని అడవులు పెద్దపులులకు ఆవాసంగా మారాయి. ఇక్కడి అనుకూల పరిస్థితులతో సరిహద్దులో గల మహారాష్ట్రలోని చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాల నుంచి పెద్దపులులు జిల్లాలోకి అడుగు పెడుతున్నాయి. స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని తమ సంతతిని పెంచుకుంటున్నాయి. అయితే జిల్లాకు వచ్చిన పులుల సంరక్షణ మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా ఆదివారం మహారాష్ట్రలో పెద్దపులి చర్మాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను మహారాష్ట్ర పోలీసులు, అటవీశాఖ అధికారులు ముందస్తు సమాచారం మేరకు పట్టుకున్నా రు. కుమురంభీం జిల్లాలో పెద్దపులిని వేటాడి చర్మాన్ని విక్రయించేందుకు మహారాష్ట్రకు వచ్చినట్లు వారి విచారణలో తేలింది. 2021లో తిర్యాణి మండలం గిన్నెధరి పరిసర అటవీప్రాంతాల్లో పెద్దపులిని వేటాడి చర్మాన్ని సేకరించినట్లు ముఠా సభ్యులు తెలిపినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో జిల్లాకు చెందిన ఆరుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.

పెద్దపులులకు కేరాఫ్..

కాగజ్‌నగర్ డివిజన్ పులులకు కేరాఫ్‌గా పేరు గాంచింది. సిర్పూర్(టి), కర్జెల్లి, బెజ్జూర్, కాగజ్‌నగర్ రేంజ్ పరిధిల్లోని అటవీప్రాంతాలు పులులకు ఆవాసంగా నిలుస్తున్నాయి. ఇక్కడ వాగులు, అటవీప్రాంతం మెరుగ్గా ఉండటంతో మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ డివిజన్‌కు వచ్చే పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చంద్రపూర్, గడ్చిరో లి జిల్లాల్లోని రాజూరా, కొఠారీ, వీరూర్, దాబా, పంబూర్ణ, అహెరి రేంజ్ పరిధిల నుంచి పెన్‌గంగ, ప్రాణహిత నదులు దాటుతూ పులులు జిల్లాకు చేరుకుంటున్నాయి. సీసీ కెమెరాలు, పాదముద్రల ఆధారంగా పులులను గుర్తిస్తున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం వాటి వివరాలను బయటికి రాకుండా గోప్యత పాటిస్తున్నారు.

పెరిగిన సంతతి..

చంద్రపూర్ జిల్లా తాడోబాలో సుమారుగా 50కి పైగా పులులు ఉన్నాయి. కొత్త పులులు తాడోబాలో నివాసం ఉండలేక సిర్పూర్(టి) రేంజ్, బెజ్జూర్ రేంజ్ పరిధిలోకి పెన్‌గంగ, ప్రాణహిత నదులు దాటి వస్తున్నాయి. ఈ రెండు నదులకు ఇరువైపులా దట్టమైన అటవీప్రాంతాలు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అడవుల్లో శాఖాహార జంతువులు, దట్టమైన అడవి, తీగదరి పొదలు, గుహలు, కొండప్రాంతాలు వాటికి అనుకూలంగా ఉన్నాయి. బెజ్జూర్ రేంజ్ పరిధిలో సిద్దేశ్వర్ గుట్టలు, తాళ్ల మడుగు, సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని మానిక్‌పటార్, మాలిని అటవీప్రాంతాల్లో గుహలు ఎక్కువగా ఉన్నాయి. సిర్పూర్(టి) రేంజ్ పరిధిలో చీలపెల్లి– మాలిని ప్రాంతంలో 1, లక్ష్మీపూర్– భూపాలపట్నం ప్రాంతంలో 1, బెజ్జూర్ రేంజ్ పరిధిలోని కడంబా అటవీ ప్రాంతంలో 3, పెంచికల్‌పేట్– కొండపల్లి అటవీప్రాంతంలో 2, బెజ్జూర్– మర్తిడి అటవీప్రాంతంలో 2, కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని గోంది, ఆరెగూడ, గన్నారం అటవీ ప్రాంతాల్లో 2 పులులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. మొత్తం 12 పులుల వరకు కాగజ్‌నగర్ డివిజన్‌లో సంచరిస్తున్నట్లు 2020– 21లో అధికారులు అంచనా వేశారు. ఇవే కాకుండా కొన్ని పులులు సరిహద్దు నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కోసారి కాగజ్‌నగర్ డివిజన్ నుంచి తిర్యాణి, వాంకిడి, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాల వరకు పులులు సంచరిస్తుంటాయి. తాజాగా మహారాష్ట్రలో పట్టుబడిన నిందితులు తిర్యాణి అటవీప్రాంతంలో పులిని వేటాడినట్లు తెలుస్తోంది.

అటవీ అధికారుల తీరు సరికాదు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

- అభివృద్ధికి అడ్డుపడుతున్నారు..
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: అటవీశాఖ అధికారుల తీరు సరికాదని, వెంటనే పద్ధతి మార్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో రత్నమాల అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, తీరు మారకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు చెట్లు నరుకుతూ రోడ్డు వేస్తున్నారని, ఆదివాసీల కోసం బోర్లు వేస్తామంటే మాత్రం అనుమతించడం లేదన్నారు. కొంతమంది అధికారులే కలప స్మగ్లింగ్‌ను ప్రోత్సహిస్తూ, ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి కనీస అవగాహన ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం నీరు జిల్లా కేంద్రంలోనే చాలా ప్రాంతాల్లో రావడం లేదని పేర్కొన్నారు. ప్రతీ చోట నల్లాలకు ట్యాప్‌లు బిగించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ మండలాల వారీగా అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. లొద్దిగూడ గ్రామానికి రోడ్డు వేయాలని సూచించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సకాలంలో యూనిఫాం దుస్తులు అందించాలన్నారు. జెడ్పీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, కోవ అరుణ, సంతోష్, దుర్పతబాయి, రామారావు, పుష్పలత, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రజావాణికి వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ ఆర్ కాలనీలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పించాలని పెందూర్ భువనేశ్వరి దరఖాస్తు చేసుకుంది. దళిత బంధు పథకం వర్తింపజేయాలని దహెగాం మండల కేంద్రానికి చెందిన ఆసంపెల్లి సత్తయ్య, నిట్టూరు వెంకటి కోరారు. తమ స్థలంలో వేరే వ్యక్తులు అక్రమంగా ఇల్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని రెబ్బెన మండలం మాదవా యిగూడకు చెందిన దుర్గం జ్యోతి అర్జీ సమర్పించింది. అంబేడ్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన తమకు ఏడేళ్లుగా నష్టపరి హారం అందడం లేదని, వెంటనే పరిహారం చెల్లించాలని బెజ్జూర్ మండలం కాటేపెల్లి, పోతెపెల్లి రైతులు రమేశ్, మల్లయ్య, తదితరులు కలెక్టర్‌ను వేడుకున్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని జైనూర్ మండలం ఉషేగాంకు చెందిన వామన్‌రావు అర్జీ పెట్టుకున్నాడు.

మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్: ఏప్రిల్‌లో మహనీయుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిబా పూలే, 14న అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. భావితరాలకు ఈ మహనీయుల చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ డివిజన్‌లో కూడా వేడుకలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, బీసీ సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సజీవన్, ఆయా సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై ఉక్కుపాదం

- భూకబ్జాలపై 'సాక్షి'లో వరుస కథనాలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు
- సోమవారం ఫెన్సింగ్, హద్దు రాళ్లను తొలగించిన అధికారులు



అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రహరీని తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఆసిఫాబాద్: అక్రమ వెంచర్లపై అధికారులు ఉక్కుపాదం మోపారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లోని హద్దు రాళ్లు, ప్రహరీని గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నం.41/బీడీపీపీ, సర్వే నం.50/బీడీపీపీ, సర్వే నం.2/బీడీపీపీ, సర్వే నం.1/బీడీపీపీ శివారులోని రూ.కోట్ల విలువ చేసే 16 ఎకరాల భూమిలో కొంత మంది అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు విక్రయించారు. ఈ క్రమంలో 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా సోమవారం పట్టణానికి చెందిన మారుతి, విఠల్, మహదేవ్‌తోపాటు పలువురు ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లపై కలెక్టర్ హేమంత్ బోర్కడేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు వెంచర్ వద్దకు వెళ్లి బండరాళ్లు, ప్రహరీని తొలగించారు. తహసీల్దార్ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, ఎంసీ భరత్, సిబ్బంది జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన వెంచర్లను తొలగించారు. కాగా పట్టణంలోని చెక్‌పోస్టు, గుండి రహదారి, ఫైర్ స్టేషన్ వెనుక ఉన్న అక్రమ వెంచర్లను సైతం తొలగించాల్సి ఉంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి సమీపంలోని సర్వే నం.50/బీడీపీపీకి చెందిన ఐదెకరాలు, 41/బీడీపీపీలోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని, వెంటనే అడ్డుకోవాలని సోమవారం పట్టణానికి చెందిన మారుతి, విఠల్, మహదేవ్‌తోపాటు పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని జిల్లా కేంద్రానికి చెందిన నాగపురి మధుకర్‌కు చెందిన ఐదెకరాల లావాణి పట్టా భూమిని మధుకర్‌తోపాటు ఆయన కుమారుడు ప్లాట్లుగా చేసి, ఫిర్యాదులో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దీంతోపాటు జిల్లా కేంద్రంలోని అటవీశాఖ చెక్‌పోస్టుకు ఆనుకుని ఉన్న బోనగిరి ఉదయబాబుకు చెందిన నాలుగెకరాల బీడీపీపీ భూమి, సత్పుతే సుశీలకు చెందిన రెండెకరాల ఎకరాల బీడీపీపీ భూమిని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



సిర్పూర్(టి): నంబర్లు వెతుక్కుంటున్న విద్యార్థులు



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆటో

- 99.06 శాతం హాజరు నమోదు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 39 పరీక్ష కేంద్రాల్లో 6,823 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 6,759 మంది హాజరైనట్లు డీఈవో అశోక్‌కుమార్ తెలిపారు. 64 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. 99.06 శాతం హాజరు నమోదైందని తెలిపారు. కాగజ్‌నగర్‌లోని పరీక్ష కేంద్రాలను జిల్లా పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. అలాగే వాంకిడి, రెబ్బెన, గంగాపూర్ కేంద్రాలను డీఈవో తనిఖీ చేశారు.

కుంటుకుంటూ పరీక్షకు..

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కినక దాముకు ఇటీవల కబడ్డీ ఆడుతుండగా కాలు విరిగింది. వైద్యులు పట్టీవేయడంతో ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో పరీక్ష కేంద్రానికి ఇనుప స్టాండ్ సాయంతో కుంటుకుంటూ చేరుకుని పరీక్ష రాశాడు.

యువకుడి ఔదార్యం..

చింతలమానెపల్లి(సిర్పూర్): డబ్బా గ్రామం నుంచి చింతలమానెపల్లిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేదు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు నడుస్తున్నా సకాలంలో సెంటర్లకు చేరుకునే అవకాశం లేదు. దీంతో డబ్బా గ్రామానికి చెందిన శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ పదో తరగతి విద్యార్థుల కోసం సొంత ఖర్చుతో వాహనాలు ఏర్పాటు చేశాడు. పరీక్షలు ముగిసేంత వరకు విద్యార్థులకు రెండు ఆటోలు అందుబాటులో ఉంచుతామని శ్రీనివాస్ తెలిపారు.

దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, తదితరులు

ఆసిఫాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొమురయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య కీలకపాత్ర పోషించారన్నారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, యాదవ కుల సంఘ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని శివాజీ విగ్రహానికి ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోలె బిక్కాజి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మారుతి, ఆత్మ చైర్మన్ రమేశ్, నాయకులు మారుతి, సంతోశ్, మనోహర్, బాబురావ్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సిర్పూర్ పేపర్ మిల్లులో గతంలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు పాల్వాయి హరీశ్‌బాబు, కొంగ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లులో నూతనంగా చేపట్టే కార్మికుల నియామకాల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. పాత గ్రాట్యుటీ, పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మిల్లులో క్యాంటీన్ ఏర్పాటు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. 80 శాతం స్థానికులతో భర్తీ చేసిన తర్వాతే స్థానికేతరులకు అవకాశం ఇవ్వాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మిల్లు యజమాన్యం ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.35వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మిల్లు యజమాన్యం, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, అంజయ్య, శంకర్, భీంరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి



రవి వాల్మీకి (ఫైల్)

మందమర్రిరూరల్: గత నెల 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బొడ్డు రవి వాల్మీకి (46) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ... ఒర్రెగడ్డ ఏరియాకు చెందిన రవి గత నెల 29న ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రవిని 108లో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. రవి ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య కనకలక్ష్మి, ఈశ్వర్‌వాల్మీకి, సింహవాల్మీకి ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఔట్ సోర్సింగ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బాబుగౌడ్ ఎన్నిక కాగా అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, చీఫ్ అడ్వైజర్‌గా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా మనోహర్, రుక్మారెడ్డి, సునీల్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా దేవేందర్, సభ్యులుగా శ్యాంకుమార్, దేవేందర్, రజిత, పవన్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

అంబులెన్స్ యజమానుల దౌర్జన్యం



ధర్నాలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో అంబులెన్స్ యాజమాన్యాల దోపిడీ, దౌర్జన్యాన్ని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సోమవారం ఆందోళన చేశారు. మందమర్రికి చెందిన జర్నలిస్టు రవి రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌తో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతదేహాన్ని మందమర్రికి చెందిన నార్ల నరేశ్ అంబలెన్స్‌లో రిటన్ కిరాయి, హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు, మంచిర్యాల నుంచి మందమర్రికి రూ.8వేలకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. పోస్ట్‌మార్టం తర్వాత మందమర్రికి తరలించాల్సి ఉండగా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న అంబులెన్స్‌ల యజమానులు ఎండీ.సల్మాన్ (అంబులెన్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్), ఆర్వి ఎస్.నరేష్, పులి సంతోష్, ఓజోజు మహేష్, ప్రేమ్ ప్రసాద్ అడ్డుకున్నారు. రూ.3 వేల చెల్లించాల్సిందేనని డిమాండ్ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు అంబులెన్స్‌ల యజమానులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. సీఐ రాజు హామీతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని మందమర్రికి తరలించారు.

‘పది’లంగా పరీక్షకు..



దండేపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



నిర్మల్లో..



దహెగాంలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. విద్యార్థులు ఉదయం 9గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకుని వారివారి హాల్‌టికెట్ నంబర్లు చూసుకోవడంలో బిజీగా మారారు. గ్రామాల నుంచి పరీక్ష కేంద్రానికి వచ్చేందుకు పలువురు విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అలాగే ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు సైతం వాహనాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పరీక్ష కేంద్రానికి తరలివచ్చారు. అయితే కడెం మండలంలో విద్యార్థి రోహిత్ తండ్రి ఆదివారం రాత్రి మృతిచెందగా పుట్టెడు దుఃఖంతో పరీక్షకు హాజరు కాగా పలువురు దివ్యాంగ విద్యార్థులు సైతం పది పరీక్షలు రాశారు.



కెరమెరి: కాలు విరిగి పోవడంతో పరీక్షకు..



తాండూర్: దివ్యాంగ విద్యార్థిని తీసుకొస్తూ..



కడెం: తండ్రి మరణించిన పరీక్ష రాసేందుకు వచ్చిన రోహిత్



నార్నూర్‌లో పరీక్ష రాస్తున్న అంధ విద్యార్థి అనిల్



చింతలమానెపల్లి: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటూ..



నిర్మల్‌లో పరీక్ష కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది



తాంసి: కప్పర్ల పాఠశాలలో నానమ్మ గంగుబాయితో దివ్యాంగ విద్యార్థి సిద్దార్థ్



నెన్నెల: ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు



నిర్మల్‌లో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉపాధ్యాయురాలు



దండేపల్లి: లింగాపూర్‌లో స్క్రైబ్ సాయంతో పరీక్షకు అంధ విద్యార్థి

దొంగతనానికి పాల్పడిన ఇద్దరి రిమాండ్

- స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: పెద్దనపల్లి శివారు వైన్స్‌షాప్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని, మరొక్కరు పరారీలో ఉన్నట్లు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. పెద్దపల్లి జిల్లాకు చెందిన మహ్మద్ సమీర్, అబ్దుల్ షాకీబ్, ఎండీ గౌడ్‌లు గత నెల 19న రాత్రి 2గంటల సమయంలో ఆర్ఎస్ వైన్స్‌కు వెళ్లి మూడు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఇనుప రాడ్లతో వైన్స్ షట్టర్ తాళాలు పగలగొట్టారు. షాపులోని రెండు మొబైల్ ఫోన్లు, రూ.20వేల నగదు, లిక్కర్ బాటిల్స్ దొంగిలించారు. అనంతరం గోస్ కరీంనగర్ వెళ్లగా వీరిద్దరు మళ్లీ దొంగతనం చేసేందుకు రిక్కీ నిర్వహించేందుకు బెల్లంపల్లి వైపు వెళ్తుండగా తనిఖీల్లో భాగంగా పోలీసులు అనుమానం వారి వారిని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి స్కూటీ, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఎస్సై గంగారాం, ఏఎస్సై రవీందర్ ఉన్నారు.

పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను నియమించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి



జీఎంకు వినతి పత్రం అందిస్తున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను నియమించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఎస్అండ్‌పీసీ కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. కంపెనీలో చాలా కాలంగా పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను నియమించలేదన్నారు. కేవలం కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులను తీసుకుంటున్నారన్నారు. పర్మినెంట్ సెక్యూరిటీ గార్డులను తగ్గిస్తే కంపెనీ ఆస్తులకు రక్షణ కొరవడుతుందన్నారు.

జీఎంకు మెమోరాండం సమర్పణ..

అనంతరం జీఎం సంజీవరెడ్డిని కలిసి క్వార్టర్ల సమస్యలపై వినతి పత్రం అందించారు. గోదావరిఖని నుంచి శ్రీరాంపూర్ డివిజన్ గనులకు వచ్చిన పని చేస్తున్న అక్కడి స్థానికులకు గోదావరిఖనిలోని సెక్టార్ 2లో ఉన్న క్వార్టర్లను అలాట్ చేయాలని జీఎంను కోరారు. ఆయూనియన్ బ్రాంచీ నాయకులు గుల్ల బాలాజీ, హరీశ్, సాయిరాం ఉన్నారు.

‘ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ’



పోస్టుకార్డులు పంపుతున్న కాంగ్రెస్ నేతలు

జన్నారం: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెడ్మ బొజ్జు అన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ పోస్ట్‌కార్డుల ఉద్యమంలో భాగంగా సోమవారం జన్నారం మండల కేంద్రంలోని తపాల కార్యాలయం నుంచి మోదీకి పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనర్హత వేటు వేసి మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ నెల 8న మంచిర్యాలలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు భారీగా జనం తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాసియుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న అధికార ప్రతినిధి వెంకటరాజం, నాయకులు ఇందయ్య , గంగన్న యాదవ్, కరుణాకర్, రమేష్, అజారుద్దీన్, ప్రశాంత్, రోహిత్‌దాస్ నరసింగరావు, లక్ష్మి, వసీంపటేల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్యపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బండి ప్రభాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలను లైంగికంగా వేధిస్తున్నట్లు ఎమ్మెల్యేపై ఆరోపణలు నిత్యకృత్యంగా వస్తున్నాయని తెలిపారు. ఆరిజిన్ డెయిరీలో పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయకపోతే ఏసీపీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు ఆదర్శ్ వర్ధన్ రాజు, రాజలింగు, సరోజ, శివశంకర్, బాకం మల్లేష్, ఎలుక ఆకాశ్, కుమార్ పాల్గొన్నారు.

రక్షణకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వర్తించాలి



అవగాహన కల్పిస్తున్న డీజీఎం గోపాల్‌రాజ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏరియాలో విధులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పనులు చేయాలని కార్పొరేట్ డీజీఎం (సేఫ్టీ) జీఎస్ గోపాల్‌రాజ్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్‌లలో సోమవారం సేఫ్టీ మేనేజ్‌మెంట్ అమలుపై ఉద్యోగులు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎంపీ రూపకల్పన, అమలు, ప్రాధాన్యత అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు వివరించారు. ఈ సందర్భంగా గతంలో చోటు చేసుకున్న ప్రమాదాలకు గల కారణాలను వివరిస్తూ భవిష్యత్‌లో అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యం, వేగంగా పనిని ముగించాలనే ఆలోచనలో చేసే తప్పిదాలే ప్రమాదాలకు దారి తీస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, డీజీఎం స్టోర్స్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘లెదర్ పార్కుకు నిధులు అడ్డుకుంటున్న ఎమ్మెల్యే’

పాతమంచిర్యాల: మందమర్రిలో లెదర్‌పార్క్ ఏర్పాటుకు ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉద్దేశపూర్వకంగానే నిధుల కేటాయింపు అడ్డుకుంటున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.వి గుణ సోమవారం తెలిపారు. పార్క్ నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తే దళితుల్లో ఒక వర్గం బాగుపడుతుందనే ఉద్దేశంతోనే కుట్ర చేస్తున్నారన్నారు. 10వేల మాదిగ కుటుంబాలు బాగుపడుతాయని, అది ఇష్టంలేని ఎమ్మెల్యే లెదర్‌పార్కు కోసం ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించినా వాటిని విడుదల కాకుండా చూస్తున్నారన్నారు. వెంటనే నిధులు విడుదలకు అడ్డు తప్పుకోవాలని కోరారు.

తల్లిదండ్రులకూ పరీక్షే..!



ప్రాథమిక పాఠశాల వద్ద వంటలు సిద్ధం చేస్తున్న తల్లిదండ్రులు

- టెన్త్ విద్యార్థులకు తోడుగా తల్లిదండ్రులు
- కరంజి(టి) విద్యార్థులకు అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రం
- 25 కి.మీ దూరంతో ఆందోళన
- రోడ్డు, రవాణా సౌకర్యం అంతంత మాత్రమే
- అందర్‌బంద్‌కు పిల్లలతో తల్లిదండ్రుల బస
- వారానికి సరిపడా కిరాణా సామగ్రి కొనుగోలు

తాంసి: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని భీంపూర్, అర్లి(టి), కరంజి(టి), అందర్‌బంద్ పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాశారు. కరంజి(టి) నుంచి పరీక్ష కేంద్రానికి సుమారు 25 కి.మీ దూరం ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు గంటకు పైగా ప్రయాణం, దీనికి తోడు అంతరాష్ట్ర రహదారిపై పూర్తిగా గుంతలమయంగా ఉంది. సరైన రవాణా సౌకర్యం లేదు. సకాలంలో చేరుకునే అవకాశం లేకపోవడంతో పిల్లల వెంట తల్లిదండ్రులు అందర్‌బంద్‌కు పయనమయ్యారు. వారానికి సరిపడా కిరాణా సామగ్రిని, ఇతర వస్తువులను కొనుగోలు చేసుకుని అక్కడికి వెళ్లారు.

జీపీ భవనం, ప్రాథమిక పాఠశాలలో బస..

కరంజి(టి) పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి నిత్యావసర సామగ్రితో అందర్‌బంద్‌కు వచ్చారు. పరీక్షలు ముగిసే వరకు పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాలలో వారు ఉండనున్నారు. వారి సౌకర్యార్థం పంచాయతీ భవనంలో సర్పంచ్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులు ఉదయం పరీక్ష రాస్తుండడం, వారికి సమయానికి వంట సిద్ధం చేసి పెడుతున్నారు తల్లిదండ్రులు. వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతిఏటా పది పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. ఇప్పటికైనా అందర్‌బంద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే వచ్చే సంవత్సరం అర్లి(టి)లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

పరీక్ష కేంద్రం మార్చాలి



కరంజి(టి) గ్రామానికి పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో రావడానికి ఇబ్బంది పడుతున్నాం. గ్రామానికి కనీసం బస్సు సౌకర్యం సరిగ్గా లేదు. తల్లిదండ్రులు తమను తీసుకొచ్చి అక్కడే ఉంచి పరీక్ష రాయిస్తున్నారు. వచ్చే సంవత్సరం పరీక్ష కేంద్రం మార్చాలి.

– డి.అమూల్య, విద్యార్థిని కరంజి(టి)

పరీక్ష కేంద్రం దూరంతో ఇబ్బంది



కరంజి(టి) నుంచి అందర్‌బంద్ పరీక్ష కేంద్రం దూరంగా ఉంది. కేంద్రం రావడానికి సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేదు. కేంద్రానికి సకాలంలో చేరుకునే పరిస్థితి లేదు. వారం పాటు ఇక్కడే ఉండి పరీక్షలు రాయాలని తల్లిదండ్రులతో కలిసి వచ్చి ఇక్కడే ఉంటున్నాం.

– అలాలి చరణ్, విద్యార్థి, కరంజి(టి)

ఇక్కడే ఉంటున్నాం..



పది పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని వారితో కలిసి అందర్‌బంద్‌లో ఉంటున్నాం. ఇక్కడ ఉండి వారికి భోజనం, ఇతర అవసరాలను దగ్గరుండి చూస్తున్నాం. ప్రతి ఏటా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదు. పరీక్ష కేంద్రం మార్చాలి లేకపోతే విద్యార్థుల పరీక్షల సమయంలో అధికారులు వసతులు కల్పించాలి.

– అలాలి రమేశ్, విద్యార్థి తండ్రి, కరంజి(టి)



అందర్‌బంద్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు



అందర్‌బంద్ పంచాయతీ భవనంలో చదువుతున్న విద్యార్థులు